ఓఆర్ఎస్.. వేడిమి నుంచి ఉపశమనం

- అందుబాటులో ఉంచుకోవడం తప్పనిసరి
- అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభ్యం
- మోతాదుకు మించి తాగకూడదు


చెముడులంకలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: ఏప్రిల్ నెలలోనే రోహిణీ కార్తె ప్రవేశించకముందే ధనిష్ట నక్షత్రంలోనే భానుడి భగభగలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకూ అక్కడక్కడా విపరీతమైన మంచు కురుస్తుండగా మధ్యాహ్నానికి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. దీంతో ఇప్పటికే ఉక్కపోతలు రోజు రోజుకూ పెరిగి వడగాడ్పులు వీచడంతో తీవ్ర అనారోగ్య సమస్యలు సంభవిస్తున్నాయి. దైనందిన జీవితంలో భాగంగా అనేక మంది ప్రజానీకం ఎండల్లో ఎక్కువగా తిరుగవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో ఎండ తీవ్రత ధాటికి శరీరంలో నీటి శాతం క్రమేపీ క్షీణించి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారు. ఫలితంగా వడదెబ్బ సంభవించే అవకాశం ఉంటుంది. అలాంటి ప్రమాద సమయంలో ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) ద్రావణం ఉపకరిస్తుందని వైద్యారోగ్య అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఓఆర్ఎస్ ద్రావణం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నారు. అలాగే గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 25 గ్రామీణ పీహెచ్‌సీలు, నాలుగు సీహెచ్‌సీలు ఉన్నాయి. వాటితో పాటు ఆ పరిధిలోని 439 హెల్త్ క్లినిక్‌లలో ఈ ఓఆర్ఎస్ ద్రావణాన్ని, జింక్ మాత్రలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలో ప్రజలకు అందుబాటులో ఉంచారు.

ఓఆర్ఎస్ ద్రావణం ప్రాధాన్యం ఇలా..

వాతావరణ పరిస్థితులకనుగుణంగా నివసిస్తున్న ప్రదేశాన్ని ప్రతి ఒక్కరూ శరీరాన్ని నిర్దిష్టమైన ఉష్ణోగ్రత ఉండే విధంగా వైద్యుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలి. మెదడులో హైపో తలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా లేదా ఎండలో ఎక్కువగా తిరిగినా హైపో తలామస్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా హైపో తలామస్ ప్రదేశం అధిక ఉష్ణోగ్రతకు లోనై క్రమబద్ధీకరించే స్థితిని కోల్పోతుంది. ఆ స్థితిలో తల తిరగడం, నీరసం, నిస్సారణ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. అలాంటప్పుడు ఆ లక్షణాలు ఉన్న వ్యక్తి వడదెబ్బకు గురైనట్టు నిర్ధారణకు రావాలి. అలాంటి సమయంలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగితే చక్కని ఉపశమనం కలుగుతుందని వైద్యాధికారుల బృందం వివరిస్తుంది. వేసవి దృష్ట్యా అన్ని గ్రామ సచివాలయ పరిధిలోను, సబ్ సెంటర్లను లోను ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతున్నామని చెబుతున్నారు.

ఓఆర్ఎస్ తాగే విధానమిలా..

ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన ద్రావణం. ఈ ద్రావణం 20.5 గ్రాముల ప్యాకెట్ల రూపంలో అన్ని ప్రాథమిక, ప్రభుత్వ, ఏరియా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటుంది. ఈ ప్యాకెట్‌లో 2.6 గ్రా. సోడియం క్లోరైడ్, 1.5 గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9 గ్రా. సోడియం సిట్రేట్, 13.5 గ్రా. డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు (అరస్పూన్) పంచదార కలిపి తాగవచ్చు. రెండేళ్ల లోపు వారు 100 ఎంఎల్ లోపు ద్రావణాన్ని అర స్పూన్ చొప్పున ప్రతీ పది నిమిషాలకు ఒకసారి తాగాలి.

రెండు నుంచి పదేళ్ల వయసు కలిగినవారు 100- 200 ఎం.ఎల్. (ఒక గ్లాస్) వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి. పదేళ్ల పైబడిన వారు 50 ఎంఎల్ (చిన్న గ్లాస్) చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగాలి.

వినియోగంపై అవగాహన పెంచుతున్నాం



వేసవికాలం దృష్ట్యా ప్రజల ఆరోగ్యం కోసం వడదెబ్బ నుంచి ఉపశమనం కలిగించేందుకు అన్ని గ్రామ సచివాలయాల్లోను, వైద్యారోగ్య సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాం. ఓఆర్ఎస్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి తమ ఆరోగ్య సిబ్బంది వివరిస్తున్నారు.

– కె.శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

క్లుప్తంగా

వృత్తి నైపుణ్యతపై విద్యార్థులకు శిక్షణ


పదో తరగతి విద్యార్థులకు శిక్షణనిస్తున్న భీమారావు తదితరులు

అయినవిల్లి: పదో తరగతి విద్యార్థులకు వృత్తి నైపుణ్యతపై జిల్లా బాలికా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి ఎంవీకే భీమారావు శిక్షణ నిర్వహించారు. శనివారం ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ నిర్వహించారు. కె.భీమారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలన్నారు. ఆయన స్థానిక మెకానిక్ గ్యారేజ్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష ద్వారా పదో తరగతి పరీక్షలతో పాటు 30 మార్కులకు ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల అనంతరం లెర్న్ అండ్ ఎర్న్ పద్ధతిలో 12 రోజుల పాటు 30 మంది విద్యార్థులకు శిక్షణనిచ్చారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు ప్రారంభించారు. ఆటోమోటివ్ ట్రైనర్ వై.వెంకటేష్, అగ్రికల్చర్ ట్రైనర్ కె.కమల ప్రియ, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా కనుమూరి


కనుమూరి శ్రీనివాసరాజు

కొత్తపేట: ఆత్రేయపురం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా కనుమూరి శ్రీనివాసరాజు నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి సిఫారసు మేరకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం మండల అధ్యక్షులను ప్రకటించింది. దానిలో భాగంగా పార్టీ సీనియర్ నాయకుడిగా, గతం నుంచీ పార్టీ మండల అధ్యక్షుడిగా సేవలందిస్తున్న శ్రీనివాసరాజును మళ్లీ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఆయన నియామకంపై మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

చేతి సంచుల పంపిణీ


లక్కవరంలో చేతి సంచులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: మండలంలోని లక్కవరంలో శనివారం మానవతా మూర్తులు, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానికుడు వారణాసి నాయుడు దాతృత్వంతో సమకూర్చిన 2 వేల చేతి సంచులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ పాటిస్తూ, తన భార్య నాగ వెంకటలక్ష్మి జ్ఞాపకార్థం రూ.30 వేలు విలువైన 2 వేల చేతి సంచులను ఇచ్చి, ప్లాస్టిక్ నిషేధంపై ముందడుగు వేసిన దాత నాయుడును ఎమ్మెల్యే అభినందించి, సత్కరించారు. సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు బోణం రాజు, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, జాన శంకరరావు, నిమ్మగడ్డ గెద్దయ్య, మంగెన వెంకట నరసింహారావు, మంగెన నాని, దిరిశాల బాలాజీ, ఉలిశెట్టి లక్ష్మణరావు, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను స్కూల్లో చేర్పించండి

మామిడికుదురు: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ స్కూల్స్‌లో చేర్పించాలని డీవైఈఓ జి.సూర్యప్రకాశం పిలుపు నిచ్చారు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా శనివారం మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ బడి, అమ్మ ఒడి, బడి ఈడు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించండి అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని డీవైఈఓ సూర్యప్రకాశం పేర్కొన్నారు. మామిడికుదురు హైస్కూల్‌లో చదువుకున్న ఎంతో మంది ఉన్నత చదువులు చదువుకుని విదేశాల్లో ఉన్నారని హెచ్ఎం సీహెచ్ నిరంజని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


మామిడికుదురులో ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న డీవైఈఓ

సాక్షిపై తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలి


అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

అంబాజీపేట: సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డితో పాటు మరో ఆరుగురిపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, తాజా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పళ్ల సూర్యప్రకాశరావు (బాబ్జి) డిమాండ్ చేశారు. అంబాజీపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ది అంబాజీపేట జర్నలిస్ట్ అసోసియేషన్ (తాజా) సభ్యులు సంఘీభావం తెలిపారు. శ్రీనివాస్, బాబ్జిలు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్‌తో సహా ఆరుగురు పాత్రికేయులపై కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య విలువలకు విఘాతమన్నారు. పల్నాడు జిల్లాలో జరిగిన హత్యోదంతంలో దోషులను శిక్షించాల్సింది పోయి, వార్త కవర్ చేసిన సాక్షి జర్నలిస్టుల పైనా, మీడియాపైనా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. వార్తలో పేర్కొన్న విషయాల్లో నిజానిజాలను ఖరారు చేసుకుని నిందితులపై చర్యలు తీసుకోవడం మాని, పాత్రికేయులపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జర్నలిస్టులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సీఎన్ మూర్తి, ఐవీ కుమార్, మాలే దుర్గాప్రసాద్, జల్లి విక్టర్‌కుమార్, దంగేటి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్


అయినవిల్లిలంకలో మాక్‌డ్రిల్‌లో వైద్య సేవలు అందిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంకలో తుపానులు, వరదల సమయంలో తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై నోడల్ అధికారి, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్ ఆధ్వర్యంలో శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. వరదలు, తుపానులు వచ్చినప్పుడు రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ నిర్వహించే విధులపై మాక్‌డ్రిల్ జరిపారు. కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ వరద, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు అప్రమత్తమవ్వాలని అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందివ్వాలన్నారు. అలాగే ఈ సమయంలో ఎవరో వస్తారని ఎదురు చూడకుండా తమవంతు సాయం కూడా చుట్టుపక్కల వారికి అందివ్వాలని అప్పుడే ప్రాణనష్టం, ఆస్తినష్టం జరకుండా కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీవో జి.భీమారావు, వివిధ మండల శాఖల అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

వైభవంగా అమ్మవారి తీర్థం

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి తీర్థం శనివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు అమ్మవారి పూజా ఘటాలకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఘనంగా చక్రస్నానం

కొత్తపేట: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి వారి చక్రస్నానం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి చక్రస్నానాన్ని గ్రామ సమీపాన గోదావరి కాలువలో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, బాలభోగం, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను వేదపండితులు, ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి చక్రస్నానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కేంద్ర మంత్రితో ఎమ్మెల్యే భేటీ

మలికిపురం: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం భేటీ అయ్యారు. ఈ మేరకు నర్సాపురంలో మంత్రిని ఆయన కలిశారు. నేషనల్ హైవే బైపాస్ రోడ్డు, కోర్టు పరిధిలోని గోదావరి బ్రిడ్జి కేసు విషయంపై మంత్రితో ఆయన చర్చించారు. అలాగే గుడిమెళ్ళంకలో గ్రామానికి చెందిన ఒక రైతు, నియోజకవర్గం అభివృద్ధికి ఉపయోగపడే రూ.600 కోట్ల ప్రాజెక్ట్‌ను కేవలం రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని సాకుగా చూపి, గత నాలుగు సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై కేంద్ర అడ్వకేట్ ఆన్ రికార్డ్స్ సహాయంతో కేసు డిస్మిస్ చేయించాలని కోరినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎనిమిది మంది విద్యార్థుల ఉత్తీర్ణత

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ సెకండియర్‌లో 14 మంది, ఫస్టియర్‌లో ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత అయినట్లు హెచ్ఎం కడలి సాయిరామ్ శనివారం తెలిపారు. ఫస్టియర్ 35, సెకండియర్ 64 శాతం వచ్చిందన్నారు. ఫస్టియర్‌లో పి.తేజశ్రీ 457, సెకండియర్‌లో కె.కీర్తన 870 మార్కులు సాధించారన్నారు.

క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం


అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలతో గొల్లపల్లి

సఖినేటిపల్లి: వేర్వేరు ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందింప చేసేందుకు క్రీడలు దోహద పడతాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో స్థానిక జైభీమ్ ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. కాగా టోర్నమెంట్ మొదటి బహుమతిగా రూ.29,999 నగదును విజేత పింకు, చిన్నా లెవెన్ టీంకు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమారుడు గొల్లపల్లి శ్రీధర్, ద్వితీయ బహుమతిగా రూ.15,999 నగదును విజేత మూడుతూములు ఎంసీసీ లెవెన్ టీంకు కేఎస్ఎన్ రాజు, తృతీయ బహుమతిగా రూ.9,999 నగదును విజేత అంతర్వేది లెవెన్ టీంకు బళ్ళ రత్నరాజు అందజేశారు. టోర్నమెంట్ స్పాన్సర్స్‌గా దెందుకూరి రమేష్‌రాజు, దొండపాటి శశికిరణ్, షీల్డ్ స్పాన్సర్, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నేతల నాని, బాల్ స్పాన్సర్ రాపాక మహేష్ వ్యవహరించారు. వైస్ ఎంపీపీ-1 కొల్లాబత్తుల శుభాకర్, జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, బళ్ళ ప్రసన్నకుమారి, నాయకులు కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, తాడి సహదేవ్, నల్లి రక్షణ, కలిగిత బాలకృష్ణ, సంఘ కమిటీ మెంబర్లు సీహెచ్.బాసు, బి.బాబి, బి.కృపావరం, జి.వి జయరాజు, దిలీప్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

కొత్తపేట: మండలంలోని రాజవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సబ్‌డివిజన్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ డి.జమలయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ జనా ఆంజనేయులు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వలన ప్రయోజనాలు ముఖ్యంగా భూసారం పెరుగుదల, పంట పెట్టుబడి ఆదా, నాణ్యతతో కూడిన ఆరోగ్యకరమైన ఉత్పత్తుల దిగుబడి గురించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం విధానంలో నవధాన్యాల సాగు వలన కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు.

సర్పంచ్ ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించడం ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించి ఆరోగ్య కారమైన ఉత్పత్తులు అందించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా ఇద్దరు ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. నవధాన్యాల కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా అయ్యప్ప జన్మనక్షత్ర వేడుకలు


బడుగువానిలంకలో కలశాలతో ఊరేగింపు చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో అయ్యప్పస్వామి జన్మనక్షత్ర ఐదో వార్షికోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. అయ్యప్పస్వామి ఉత్తర నక్షత్రంలో జన్మించిన దృష్ట్యా అయ్యప్ప భక్తుడు దూలం రవితేజ ఏటా మాదిరిగానే ఈ పూజలను స్థానిక గురుస్వాముల సహకారంతో నిర్వహించారు. కడియంకు చెందిన తాడాల వీర వెంకటరావు గురుస్వామి, పడాల వెంకటేశ్వరరావు నేతృత్వంలో పరిసర ప్రాంతాల నుంచి వందలాదిగా అయ్యప్ప భక్తులు తరలివచ్చి 54 కలశాలతో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. చొప్పెల్ల శివాలయ అర్చకుడు యలమంచిలి రాజశేఖర్ శర్మ వేద మంత్రోచ్చారణల మధ్య పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో స్వామికి భక్తులు విశేష పూజాభిషేకాలు చేపట్టారు. గ్రామమంతా అయ్యప్ప శరణ ఘోషలతో మార్మోగిపోయింది. యెరుబండి మధు, తమ్మన వెంకన్నబాబు, పడాల గోపాలకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు


అయినవిల్లి: నల్లచెరువులో వేంచేసిన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. దీంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

అప్పనపల్లిలో.

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. స్వామికి వివిధ సేవల ద్వారా రూ.2.76,303 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్య నారాయణరాజు తెలిపారు. స్వామిని 3,500 మంది భక్తులు దర్శించుకున్నారని, 1800 మంది భక్తులు స్వామి వారి నిత్యాన్నదాన ప్రసాదం స్వీకరించారని ఆలయ అధికారులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


అవిడిలో బాబ్జీరాజుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామ ప్రముఖుడు, ఆదర్శ రైతు గాదిరాజు బాబ్జీరాజు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. బాబ్జీరాజు (88) ఇటీవల మృతి చెందారు. వివిధ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో నాణ్యమైన అధిక దిగుబడులు సాధిస్తూ ఉత్తమ రైతుగా, ఇతర రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ ఆదర్శ రైతుగా ఆయన గుర్తింపు పొందారు. శనివారం జగ్గిరెడ్డి స్థానిక నాయకులతో కలసి బాబ్జీరాజు స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద పుష్పాలుంచి నివాళుర్పించారు. ఆయన కుమారులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రెడ్డి సుభాష్, పరమట సూర్యప్రకాశరావు తదితరులు ఉన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ-ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.1,82,180, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.49,213తో మొత్తం రూ.2,31,393 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ సూర్యచక్రధరరావు తెలిపారు.

వనజీవి రామయ్యకు సంతాపం

అంబాజీపేట: వనజీవి రామయ్య మృతితో గొప్ప పర్యావరణవేత్తను కోల్పోయామని కోనసీమ కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు మాచవరం శివారు కోటి వారి అగ్రహారం శివారులోని కుమ్మరి పాలెంలో ఉన్న సీతారామ ఆలయం వద్ద వనజీవి సంతాప సభ ఏర్పాటు చేశారు. నారాయణ మూర్తి మాట్లాడుతూ పర్యావరణం కోసం రామయ్య త్యాగం అసామాన్యమైనదని , ఆయన జీవితంలో సుమారు కోటికి పైగా మొక్కలు నాటి తన ఇంటి పేరైన దర్పపల్లితో కాకుండా వనజీవిగా పిలవబడుతూ హరితహారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆదుర్తి చందు, ర్యాలి భద్ర కిరణ్, నాగేశ్వరరావు, ఆదుర్తి రామాంజనేయులు,శ్రీనివాస్, వెల్లా త్రినాథ్,తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల హవా



కదలి ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులను సత్కరించిన దృశ్యం


ముస్తాక్ జెహ్మ(941), వనమాడి వేణుశ్రీ సాయివర్మ(457), ఏడిద విజయనాగదుర్గ(920)


వాకా అమృత (914)


జీఎస్ మూర్తి (423)


బి.శ్రీవల్లి (422)


వైష్ణవి (990)

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబర్చారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చింతలూరుకు చెందిన బైపీసీ విద్యార్థిని వాకా అమృత 914 మార్కులతో సత్తా చాటింది. అలాగే ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విద్యార్థి గుత్తికొండ సూర్యనారాయణమూర్తి 470 మార్కులకు గాను 423 మార్కులు, బి.శ్రీవల్లి 422 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గతం కన్నా మెరుగైన ఫలితాలు తమ కళాశాల విద్యార్థులు సాధించారని ప్రిన్సిపాల్ సురేష్ రెడ్డి, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేశారు.

రాజోలులో..

రాజోలు: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కడలి ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని చింతా భాను 948 మార్కులతో ప్రథమస్థానం సాధించగా, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో ముస్కూడి మేరిగ్రేస్ 470 మార్కులకు 439 మార్కులు సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు శర్మ తెలిపారు. పాఠశాల చైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. అలాగే అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ సెకండియర్‌లో 98 శాతం, ఫస్ట్ ఇయర్‌లో 91 శాతం ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో ఎం.రేవతి 955 మార్కులు, బైపీసీలో ఎం.ప్రణవి 946 మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో కె.యక్షిత సత్య 470 మార్కులకు 442, బైపీసీలో వి.సుమశ్రీ 440 మార్కులకు గాను 414 వచ్చాయని తెలిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: మామిడికుదురు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో వనమాడి వేణుశ్రీ సాయివర్మ ఎంపీసీలో 457 (470 మార్కులు సాధించి కోనసీమ జిల్లా ప్రభుత్వ కళాశాలల టాపర్‌గా నిలిచాడు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ముస్తాక్ జెహ్మ 941 (1000) మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఏడిద విజయనాగదుర్గ 920, సీఈసీలో బొంతు కుమారస్వామి 873, హెచ్ఈసీలో ములికి సతీష్ 704 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ ఎ.పద్మశ్రీ తెలిపారు. మొదటి సంవత్సరంలో 56.25 శాతం, ద్వితీయ సంవత్సరంలో 73.58 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పద్మశ్రీ, అధ్యాపకులు అభినందించారు.

వైష్ణవికి 990 మార్కులు

రావులపాలెం: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పడాల వైష్ణవికి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో బైపీసీ గ్రూపులో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించిందని తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ రెడ్డి, రమాదేవి తెలిపారు. శనివారం విడుదలైన ఫలితాల్లో తమ కుమార్తె ఈ మార్కులు వచ్చాయన్నారు. వైష్ణవి రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతుందన్నారు.